క్లుప్తంగా

డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రారంభం

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు కోర్సుల ఎంపిక, 19వ తేదీన సీట్ల కేటాయింపులు ఉంటాయని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా సగర సంఘం అధ్యక్షుడిగా ఉప్పరి సురేష్‌కుమార్‌ను సంఘం నాయకులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జంబులాపరమేశ్వరీ దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో అన్ని నియోజకవర్గాల సంఘం నాయకులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం ఎదుగుదలకు తన వంతు కృషిచేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శిగా సాగర్, కోశాధికారి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా సర్పంచ్ బాలమద్దిలేటి, సలహాదారుడిగా ఎరుకలయ్యను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడు బాలాజీ, సర్పంచ్ రాధమ్మ, సుబ్బరాయుడు, టీవై శివయ్య, వెంకటస్వామి, చెన్నయ్య పాల్గొన్నారు.

అనుమతి పొందిన విత్తనాలను విక్రయించండి

నంద్యాల అర్బన్: ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన విత్తనాలను మాత్రమే మార్కెటింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని మహాలక్ష్మి ఆగ్రోసీడ్స్ విత్తన శుద్ధి కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన ప్రాసెసింగ్‌లో ప్లాంట్ రిజిష్టర్, డిస్పాచ్, బ్రీడర్ రిజిష్టర్లను కచ్చితంగా నిర్వహించాలన్నారు. విత్తన ప్రాసెసింగ్, ప్యాకింగ్ విధానం, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఐదు రకాల వరి విత్తనాల నమూనాలను విత్తన ప్రయోగశాలలకు పంపుతున్నామని చెప్పారు.


పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

నంద్యాల అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల అర్బన్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ తెలిపారు. పట్టణంలోని హరిజనవాడ, కొలిమిపేట, నూనెపల్లె, ఏకలవ్యనగర్, కంసాలి వీధి, నివర్తిపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రజారోగ్య వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన జరిపించారు. తల్లులకు ఓఆర్ఎస్‌పై అవగాహన, చిన్నారులకు ప్రీ స్కూల్‌పై సంసిద్ధత కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ డెంగీ, డయేరియా వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సూపర్‌వైజర్లు నజీర, సుజాత పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ



ప్లాంట్‌ల నుంచి సేకరించిన నీటి నమూనాలు

చాగలమర్రి: నంద్యాల జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆర్‌ఓ ప్లాంట్లలోని శుద్ధజల నమూనాలను సేకరించి నంద్యాలలోని ఎస్ఈ కార్యాలయానికి పంపుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18 ప్రైవేటు, 8 ప్రభుత్వ ఆర్‌ఓ ప్లాంట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్లాంట్‌లకు సంబంధించిన నీటి నమూనాలను ఆయా సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా సేకరించామన్నారు. నీళ్లల్లో ఉండవలసిన మినరల్స్ అవసరమైన మోతాదులో ఉన్నాయా లేవా అని పరిశీలిస్తారని చెప్పారు. సాధారణంగా ఆ నీటిలో పీహెచ్ 6.5 - 8.5, హార్డ్‌నెస్ 200-600లోపు , అల్కాలిటీ 200-600లోపు, ఐరన్ 0.3 - 1.0 ఎంజీ, టీడీఎస్ 500-2000 లోపు, ఫ్లోరిన్ శాతం 0.2 - 1.0 ఉండాల్సి ఉందని వివరించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి

నంద్యాల (న్యూటౌన్): 2023 డిసెంబర్‌లో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీ లోపు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఎంపికైన వారు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. వెబ్ వెర్షన్‌తో కూడిన వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ అప్లికేషన్ WWW.SCHOLARSHIPS.GOV.IN అందుబాటులో ఉందన్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతా నకలును డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఆటలతో ఆరోగ్యం

శారీరకంగా చురుకుగా, బలంగా ఉంటేనే మానసికంగా ధృడంగా ఉంటారని, ఆలోచనా శక్తి పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా నేటి విద్యార్థుల్లో శారీరక వ్యాయామం కొరవడింది. మైదానాల్లో ఆటలాడటం తగ్గించి కేవలం సెల్ ఫోన్లు, కంప్యూటర్లలో గేమ్స్‌కే పరిమితమవుతున్నారు. దీంతో అనారోగ్యాలబారిన పడుతున్నారు. పిల్లలు ఎండలో మైదానంలో ఆడుకుంటే వ్యాధినిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా, వేగంగా ఆలోచించే గుణం అలవడుతుంది.

- క్రీడలతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఉల్లాసం
- సెల్‌ఫోన్, కంప్యూటర్‌ను అభ్యసనకు పరిమితం చేయాలి
- పెరగనున్న పోటీపడే గుణం
- నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు



ఈర్నపాడు జెడ్పీ హైస్కూల్‌లో వ్యాయామం చేస్తున్న విద్యార్థులు



దొర్నిపాడులో కబడ్డీ ఆడుతున్న యువకులు



దొర్నిపాడులో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): ఆధునిక జీవన విధానంలో శారీరక శ్రమకు దూరమైన అనేక మంది 30 ఏళ్లకే అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. పాఠశాల స్థాయిలో ఎక్కువ సమయం ఆటలకు కేటాయిస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు బాల్యపు తీపి అనుభవాలకు దూరంగా సెల్‌ఫోన్, కంప్యూటర్‌లో ఆటల వైపు మొగ్గు చూపడం మంచిది కాదంటున్నారు. చక్కగా ఆడుకున్న విద్యార్థులు చదువులోనూ ముందంజలో ఉంటున్నారని సర్వేలు సైతం వెల్లడిస్తున్నాయి. నంద్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కొన్ని పాఠశాలలకు ఆటస్థలాలు సరిగ్గా లేనప్పటికీ కూడా ఉన్న కొద్ది పాటి స్థలాన్ని వినియోగిస్తున్నారు. ఆటపాటలతోనే చక్కటి ఆరోగ్యం సొంతమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

వ్యాయామంతో మానసికోల్లాసం..

ఆటలతో పాటు రోజూ గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచన సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వీలైతే జిమ్‌కు వెళ్లడం, యోగా, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జీవన విధానంలో వచ్చిన మార్పులు కారణంగా జనాభాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత అధిక బరువు కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధులు బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్లు, చాట్స్ వంటి జంక్ ఫుడ్స్‌ను అధికంగా తీసుకుంటుండటం అధిక బరువుకు కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గేందుకు రోజూ ఆటలు ఆడడంతో పాటు వాకింగ్ చేయాలని వారు సూచిస్తున్నారు.

క్రీడల్లో పాల్గొనాలి..

పాఠశాల స్థాయిలో నిర్వహించే క్రీడల్లో విద్యార్థులు కచ్చితంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలి. పోటీల్లో పాల్గొనేందుకు ముందస్తుగా సన్నదం కావడానికి కొద్ది రోజులు తర్ఫీదు ఇవ్వాల్సి వస్తుంది. ఇలా కొద్ది రోజులు మైదానంలోనే గడపాల్సి రావడంతో వారు మెల్లిగా క్రీడలవైపు మొగ్గే అవకాశముంది. అలాగే పోటీల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో పోటీ తత్వం పెరిగి, పోటీ ఎలా ఎదుర్కోవాలి, వేగంగా నిర్ణయాలు తీసుకునే గుణంతో పాటు ఆలోచన సరళి మారుతుంది. చిన్న చిన్న సమస్యలకే చితికిపోకుండా నిబ్బరంగా ఉండే తత్వం పెంపొందుతుంది. స్నేహితుల సంఖ్య పెరగడంతో పాటు సమాజం తీరును అర్థం చేసుకోవడానికి, ఎలా మసలుకోవాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలుస్తుంది.

అవసరాలను గుర్తించవచ్చు..

కేవలం వ్యాయామ పరంగానే కాకుండా క్రీడలు, పోటీల్లో పాల్గొనడం ద్వారా తమాంటే తెలుసుకునే అవకాశం కలుగుతుంది. తమ శక్తిసామర్థ్యాలు ఏంటి, ఎలాంటివి అవసరమవుతాయి, మనం దేనికి సరిపడగలం, పరీక్షలు, భవిష్యత్ అవసరాలను గుర్తించి వాటిల్లో రాణించడానికి ఉపయోగపడతాయి.

ఆటలతో సరదా



విద్యార్థి దశలో ఆటలు సరదాను నింపుతాయి. శారీరక, మానసిక, ఆరోగ్యానికి బాటలు వేస్తాయి, ఆటల్లో జట్టుగా ఏర్పడటం ద్వారా సామాజిక సంబంధాలు మెరుగవుతాయి. అందుకే పిల్లలను ఆడుకోనివ్వాలి.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపు



విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు ఆటలు దోహద పడతాయి. మైదానాల్లో పరుగులు తీయడం ద్వారా సమస్యలకు ఎదురు నిలిచి పోరాడేతత్వం అలవడుతుంది. నిత్యం కొంత సమయం పరుగుకు కేటాయిస్తే చాలా మంచిది.

– రవికుమార్, పీఈటీ, నంద్యాల

చదువు ఒక్కటే కాదు..



తల్లిదండ్రులు పోటీపడి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. చదువు ఒక్కటే ప్రధానం కాదు. ఖాళీ సమయంలో ఆటలు ఆడించాలి. తద్వారా పిల్లల్లో శారీరకంగా, మానసికంగా దృఢత్వం ఏర్పడుతుంది. ఈ సీజన్‌లో విద్యార్థులు వైద్యుల సలహాలు తీసుకోవాలి. పారిశుద్ధ్యం, పరిశుభ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి. సరైన సమయంలో మంచి పోషకాహారం తీసుకొని పాఠశాలలకు వెళ్లాలి.

– వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లైనా పలు అంశాలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ చూపాలని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. బుధవారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి కొరత ఎదుర్కొన్న రాయలసీమ, దక్షిణ తెలంగాణకు ఇప్పటికైనా న్యాయం చేయాలన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా పలు అంశాలపై ఈ నెల 6వ తేదీన జరిగే సమావేశంలో కూలంకషంగా చర్చించి పరిష్కార మార్గాన్ని కనుగొనాలని కోరారు. అదే విధంగా గుండ్రేవుల, సిద్ధేశ్వరం అలుగు, కర్నూలులో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఏర్పాటు, దుమ్ముగూడెం-నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టుపై సత్వరం ఓ నిర్ణయానికి రావాలన్నారు. రాజకీయాల కోసం కాకుండా రెండు రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి, నాయకులు పర్వేజ్, మహేశ్వరరెడ్డి, శ్రీహరి, భాస్కర్‌రెడ్డి, పట్నం రాముడు, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకార ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న సభ్యులు

నంద్యాల వ్యవసాయం: నంద్యాల లయన్స్ క్లబ్‌కు 2024 -25కు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిటీ సభ్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవికృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. అధ్యక్షుడిగా నిజాముద్దీన్, కార్యదర్శిగా శిరిగిరి రమేష్, కోశాధికారిగా మామిళ్ల నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఉపాధ్యక్షులుగా కూర ప్రసాద్, పోసిన సుబ్బారావు, సోమేశుల నాగరాజు, ఉపేంద్ర నాథ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అరవేటి రాఘవేంద్ర, ఇమ్మడి వెంకట రామకృష్ణుడు, సీనియర్ సభ్యులను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, వివిధ కార్యక్రమాల కమిటీ చైర్మన్‌లుగా ఎన్నుకున్నామని చెప్పారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఉదయం బాలాజీ కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, ఆడిటర్ గోపాలకృష్ణ, శ్రీకాంత్,రవి ప్రకాష్, ఎంపీవి రమణయ్య, మహేశ్వర్ రెడ్డి, కొశెట్టి చంద్రశేఖర్, షేక్షావలి రెడ్డి, కొశెట్టి వేణుమాధవ్, స్వామి రెడ్డి,చంద్రమోహన్ పాల్గొన్నారు.



డబ్ల్యూ గోవిందిన్నె సమీపంలో సాగైన మినుపు పంట

విస్తారంగా వినుము సాగు

దొర్నిపాడు: ఖరీఫ్‌లో భాగంగా మండలంలోని రైతులు విస్తారంగా మినుము పంట సాగుచేస్తున్నారు. తొలకరి పలకరించడంతో రైతులు మినుము తొలి పంటగా సాగు చేస్తున్నారు. ఇప్పటికే 253 హెక్టార్లకు పైగా సాగైంది. 90 రోజుల పంట కావడంతో ఏటా మినుము సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మినుము క్వింటా రూ.10వేలు పలుకుతోందని, ఎకరాకు 6-8 క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తుందని, పంట సాగుకు రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పోయినా రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయం లభిస్తుందనే ఉద్దేశ్యంతో సాగు చేస్తున్నామని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు



చాగలమర్రి-1 సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఈఓ ప్రకాశం

చాగలమర్రి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రకాశం హెచ్చరించారు. స్థానిక 1,5 సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందించే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే శెట్టివీడు సచివాలయంలో 10 మంది సిబ్బంది విధులకు హాజరైనా, కార్యాలయంలో ఇద్దరు మాత్రమే ఉండటం గమనార్హం. ఫేస్ యాప్ ద్వారా హాజరై, కార్యాలయానికి రాకుండా, హాజరు పట్టికలో సంతకాలు చేయకుండా వివిధ కార్యక్రమాలపై వెళ్లిపోయినట్లు చెప్పడం గమనార్హం.

నేడు పంచాయతీ మార్కెట్లకు వేలాలు

చాగలమర్రి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన వివిధ మార్కెట్లు, రూముల లీజుకు సంబంధించి గురువారం వేలాలు నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ ప్రకాశం బుధవారం తెలిపారు. మార్చి 31వ తేదీతో పూర్తయిన వాటికి ఏప్రిల్ నెలలో వేలం నిర్వహించగా కొందరు పాటదారుల మధ్య వాగ్వాదం ఏర్పడి, ఘర్షణకు దిగి ఒకరిపై మరొకరు దాడి చేసుకోగా.. ఓ యువకుడు హత్యకు గురవడంతో నాడు వేలాలు వాయిదా వేశామన్నారు. దీంతో ప్రస్తుతం పోలీసు బందోబస్తు మధ్య వేలాలు నిర్వహిస్తామని చెప్పారు. పంచాయతీకి సంబంధించి బస్టాండు, వారపుసంత, కబేళా, బండ్లమెట్ట, దిన మార్కెట్టు, మార్కెట్‌లోని 8 రూములు, 5 ప్లాట్‌ఫాంలు, కోటగడ్డ పంచాయతీలో రెండు రూములను ఏడాది పాటు (వచ్చే మార్చి వరకు) లీజుకు ఇవ్వటానికి వేలాలు వేస్తున్నామన్నారు. మొత్తం రూ.83వేలు డిపాజిట్ ఉదయం 10 గంటలలోపు చెల్లించి అన్ని వేలాల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు పంచాయతీ విధించిన ధరలకు మించి వసూలు చేయరాదని సూచించారు. పాటపాడిన మొత్తానికి 3 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాలన్నారు. పాల్గొనే వారు తహసీల్దార్ జారీ చేసిన సాల్వెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు.





మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

బొమ్మలసత్రం: నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసాపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించిన నేపథ్యంలో వారికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో పాటు చైర్‌పర్సన్, ఆమె భర్త జగన్‌ను కలిశారు. గతనెల 22న టీడీపీ నాయకులు 29వ వార్డు సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోల ఏర్పాటులో తన పట్ల దురుసుగా ప్రవర్తించిన ఉదంతం, కేసుల నమోదును జగన్‌కు వివరించారు.

హత్య కేసు నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్‌ను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ఆళ్లగడ్డ: పట్టణంలో హత్యకు గురైన శ్రీదేవి (54) కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిందితుల అరెస్ట్‌ను చూపించారు. డీఎస్పీ మాట్లాడుతూ పాతూరు వీధిలో నివాసమున్న భాస్కర్‌రెడ్డి, ఆయన భార్య శ్రీదేవి గత నెల 25న సాయంత్రం నంద్యాలలోని ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. వారి ఇంటి పక్కనే ఉన్న మృతురాలి మరిది వేణుగోపాల్‌రెడ్డి ఇంటిముందుకు వచ్చే సరికి అప్పటికే కాపుకాసిన ఉనన వేణుగోపాల్ రెడ్డి, ఆయన భార్య శిరీషతో పాటు మరికొందరు దుండగులు శ్రీదేవి, విజయభాస్కర్‌రెడ్డి కళ్లల్లో కారం చల్లి విక్షణారహితంగా కత్తులు, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన విజయభాస్కర్‌రెడ్డి హైదరబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తుండగా బుధవారం పట్టణ శివారులోని రామలక్ష్మి కొట్టాల సమీపంలోని శిల్ప కళా మందిరం పక్కన వ్యవసాయ పొలంలో దాక్కున్నట్లు సమాచారం రావడంతో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటరెడ్డి దాడిచేసి అట్ల వేణుగోపాల్‌రెడ్డి, అట్ల శిరీష, దూదేకుల రాకేష్, దేరుంగుల రాకేష్, దేరుంగుల దేవేంద్రకుమార్, కట్వాల శేఖర్, మేఖల నరేష్‌ను అరెస్ట్ చేశారని చెప్పారు. వీరి నుంచి రెండు బైకులు, రాడ్లు, కర్రలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా.. ఈ కేసుతో సంబంధం ఉందని టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులపై కూడా కేసు నమోదు చేశారని, వారితో పాటు వారి అనుచరుల ప్రాతపై విచారణ జరుపుతున్నామని డీఎస్పీ వివరించారు.

బోధనపై హెచ్‌ఎంలకు అవగాహన

రుద్రవరం: బోధన సమయంలో హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు ప్రశాంతంగా ఉండాలని హైదరాబాదు ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈఓ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీ బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా..శారీరకంగా,మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించగలరన్నారు.


బంద్‌కు సహకరించండి

నంద్యాల న్యూటౌన్: దేశవ్యాప్తంగా గురువారం జరుగనున్న విద్యాసంస్థల బంద్‌కు విద్యాసంస్థలు, మేధావులు, పట్టణ ప్రజలు సహకరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు ధనుంజయుడు, రఫీ, రాంబాబు, శివ మాట్లాడుతూ నీట్ ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిన తీరును నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎర్రిస్వామి, సాయి, మాబాషా, బన్ని పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.41,408 రికవరీ

- 18వ విడత సామాజిక తనిఖీ
- ఉపాధి పనుల నిర్వహణపై సామాజిక బృందం తనిఖీ
- ముగ్గురు మేటీలు, ఫీల్డ్‌అసిస్టెంట్ రాజీనామా





సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

గోస్పాడు: ఉపాధి హామీ పనుల్లో జరిగిన పొరపాట్లు, తప్పిదాల వల్ల దుర్వినియోగమైన రూ.41,408 లను అధికారులు రికవరీ చేశారు. ఉపాధి పనులపై గ్రామాల్లో నిర్వహించిన వాటిని సామాజిక తనిఖీపై బృంద సభ్యులు 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్ అధ్యక్షతన బుధవారం మండలస్థాయి సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎంఎస్‌డీ భాస్కర్‌నాయుడు హాజరై పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన 972 పనులకు రూ.7.05 కోట్లు ఖర్చు చేసిన వాటిపై ఎస్ఆర్పీ కాంతయ్య ఆధ్వర్యంలో పలువురు సామాజిక తనిఖీ సభ్యులు గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టి నివేదికలు రూపొందించారు. వీటిని గ్రామాల వారీగా ఉపాధి పనులు చేపట్టిన విధానం, వాటి నిర్వహణ తీరు సిబ్బంది గ్రామాల్లో పనులు చేయించిన విధానంపై సభలో చదివి వినిపించారు. అయితే పలు గ్రామాల్లో నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు రికవరీకి ఆదేశించారు. గ్రామాల వారీగా రికవరీ చేయాల్సిన మొత్తాలను ప్రకటించారు. వాటిలో.. ఒంటివెలగల రూ.966, జిల్లెల్ల రూ.3106, ఎం చింతకుంట్ల రూ.984, గోస్పాడు రూ.472, ఎస్ నాగులవరం రూ.625, జూలేపల్లె రూ,.730, రాయపాడు రూ.490, యాళ్లూరు రూ.3,280, దీబగుంట్ల రూ.1,428, సాంబవరం రూ.750, కానాలపల్లె రూ.3వేలు, నెహ్రూనగర్ రూ.9,635 లకుగాను ఉపాధి పనుల్లో జరిగిన పొరపాట్లు, తప్పిదాలకు పై వెంటనే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లు చెల్లించారు. అలాగే గోస్పాడు రూ.500, యాళ్లూరు రూ.వెయ్యి, దీబగుంట్ల రూ.2వేలు, సాంబవరం రూ.3,800, కానాలపల్లె రూ.3వేలు, ఎం.క్రిష్టాపురం రూ.2వేలు, నెహ్రూనగర్ రూ.వెయ్యిని రికార్డుల తప్పిదాల కింద ఆయా గ్రామాల ఫీల్డ్ అసిసెట్టంట్‌లు అధికారుల ఎదుట చెల్లించారు. వీటితో పాటు సాంబవరం రూ.1,51,696 కానాల పల్లె రూ.1,01,209, నెహ్రూనగర్ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై అంబుడ్స్‌మన్‌తో విచారణకు ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగదీశ్వరమ్మ, ఏపీడీలు అన్వరాబేగం, బాలాజీ నాయక్, ఎంపీడీఓ నాగఅనసూయ, ఏపీఓ నాగజ్యోతి క్వాలిటీ కంట్రోల్ గంగాద్రి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా...

వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో మండలంలోని మూడు గ్రామాలకు చెందిన సీనియర్ మేటీలు, ఒక ఫీల్డ్ అసిస్టెంట్ తమ పదవులకు రాజీనామా చేశారని ఎంపీడీఓ నాగ అనసూయ తెలిపారు. ఎం చింతకుంట్ల, జిల్లెల్ల, సాంబవరం గ్రామాలకు చెందిన సీనియర్ మేటీలు జ్యోతి, శివయ్య, నరసింహ, రాయపాడు ఫీల్డ్ అసిస్టెంట్ నాగజ్యోతీశ్వరరెడ్డి రాజీనామా చేసి పత్రాలను ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు అందజేశారని చెప్పారు.

ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి

నంద్యాల అర్బన్: రుణాలు తీసుకున్న వారి నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి రాజు నాయుడు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పరిసర ప్రాంతాల్లో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. తక్కువ వడ్డీ పేరుతో ఇంటి, పర్సనల్ లోన్‌లు మంజూరు చేసి కొంత కాలం తరువాత అధిక వడ్డీ చెల్లించాలని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షేక్ రియాజ్ ఉన్నారు.

ఎస్‌డీఆర్ ఆకాంక్ష ప్రభంజనం

నంద్యాల(న్యూటౌన్): నీట్ - 2024 ఫలితాల్లో ఎస్డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన విజయాన్ని అందుకుని ప్రభంజనం సృష్టించారని కాలేజీ చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. బుధవారం ఆయ న మాట్లాడుతూ అక్షితా రెడ్డి 691, లీలా మమత 676, వైష్ణవి 645, మధులిక 641, సాయి కుమార్‌రెడ్డి 629 మార్కులు సాధించారన్నారు. మొత్తం 60 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 600 మార్కులకు పైగా ఎనిమిది మంది, 550కి పైగా 16 మంది, 500కు పైగా 26 మంది మార్కులు సాధించారని ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు.